సాక్షి ములుగు

ఆదివారం । 9 । జూన్ । 2024



ప్రయాణికులకు శుభవార్త

కాజీపేట జంక్షన్‌లో రైల్వే అధికారులు, ప్రయాణికుల కోసం డార్మిటరీ రూమ్స్‌, విశ్రాంతి గదులు అందుబాటులో ఉన్నాయి.

- 8లో



గంజాయి స్మగ్లర్ల అరెస్టు

ముగ్గురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అరెస్ట్‌ చేసి రూ.50లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీపీ అంబర్‌ కిశోర్‌ ఝా తెలిపారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
$34^0 / 27^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత ఉంటుంది. రాత్రి సమయంలో సాధారణంగా ఉంటుంది.

న్యూస్‌రీల్‌

యేసుపై ఇన్‌ఫార్మర్‌ ముద్ర వేయడం సరికాదు



వాజేడు: ఇల్లెందుల యేసుపై పోలీస్‌ ఇన్‌ఫార్మర్‌గా మావోయిస్టులు ముద్ర వేయడం సరికాదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 3వ తేదీన వంట చెరుకు తేవడానికి వెళ్లిన యేసు మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ క్రమంలో మావోయిస్టులు విడుదల చేసిన లేఖలో ఇల్లెందుల యేసు పోలీసుల ఇన్‌ఫార్మర్‌ అని మావోయిస్టుల ఆచూకీ తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇవ్వడానికి వచ్చినట్లుగా ప్రకటించడం మనో వేదనకు గురి చేసిందన్నారు. యేసు మృతితో రోడ్డున పడిన కుటుంబానికి మావోయిస్టులు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా వెంకటాపురం(కె) మండలానికి చెందిన కొందరు రూ.25వేల సాయాన్ని యేసు కుటుంబానికి అందజేశారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



మల్హర్‌: మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో మహిళలు శనివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. రెండో వార్డులో మిషన్‌ భగీరథ నీరు సక్రమంగా అందడం లేదన్నారు. గత నాలుగు రోజులుగా తాగు నీటికి, ఇతర అవసరాలకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల క్రితం పల్లెలో నూతన బోర్‌ వేసిన అధికారులు నేటికీ కనెక్షన్‌ ఇవ్వకపోవడంతో ఇబ్బంది తలెత్తిందని తెలిపారు. తాగు నీటి సమస్యపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనిపై కార్యదర్శి భాస్కర్‌ను వివరణ కోరగా విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ కాలిపోవడంతో ఇబ్బందిగా మారిందని తెలిపారు. మరమ్మతు చేయించామని, త్రీ ఫేస్‌ కరెంట్‌ వస్తే నీరు అందజేస్తామని పేర్కొన్నారు.

'గ్రూప్‌-1' నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

భూపాలపల్లి: నేడు(ఆదివారం) నిర్వహించనున్న గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్‌ భవేష్‌మిశ్రా తెలిపారు. కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో ఆయన శనివారం మాట్లాడారు. అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలో బయోమెట్రిక్‌ హాజరు ఉంటుందని తెలిపారు. పరీక్ష నిర్వహణకు జిల్లాలో 17కేంద్రాలను ఏర్పాటు చేశామని, 4,473 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం నుంచి 9గంటలకు అభ్యర్థులకు కేంద్రంలో అనుమతి ఉంటుందని, 10గంటలకు ప్రధాన గేట్లు మూసి వేస్తారని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్‌ వస్తువులను పరీక్షా కేంద్రంలో అనుమతించేదిలేదని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా అన్ని శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రతీ పరీక్షా కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్‌ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులు ఎవరైన మాల్‌ ప్రాక్టీస్‌, కాపీయింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్లాక్‌ లేదా బ్లూ పెన్‌ మాత్రమే అనుమతిస్తారని వివరించారు. పటిష్ట భద్రత పోలీస్‌ ఎస్కార్ట్‌ మధ్య ప్రశ్న, జవాబు పత్రాలను తరలించాలన్నారు. తనిఖీ చేసిన తర్వాతనే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. గ్రూప్‌-1 అభ్యర్థులకు ఈ సందర్భంగా కలెక్టర్‌ శుభాకాంక్షలు తెలిపారు.

చేపలకు ఫుల్‌ డిమాండ్‌



మంగపేట: మృగశిర కార్తె సందర్భంగా జిల్లాలో ప్రజలు శనివారం చేపలను ఎగబడి కొనుగోలు చేశారు. మృగశిర కార్తె ప్రారంభం రోజు చేపల కూరతో భోజనం చేస్తే ఉబ్బసం, సీజనల్‌ వ్యాధులు సైతం దరిచేరవనేది ప్రజలకు అపారమైన నమ్మకం. దీంతో చేపలకు గిరాకీ ఉండటంతో మంగపేట మండల పరిధిలోని మల్లూరు, రాజుపేట, కమలాపురంలో గోదావరి చేపలు కేజీకి రూ.200లు ఉండగా కొందరు వ్యాపారులు రూ.350 నుంచి రూ.400 వరకు పెంచి విక్రయించారు.

ఇంకెన్నాళ్లు..?



వరంగల్‌ వైపు వెళ్లే దారి రోడ్డును మూసివేసి ఏర్పాటు చేసిన బారికేడ్లు



ఛత్తీస్‌గఢ్‌ నుంచి వచ్చే దారి వైపు ఏర్పాటు చేసిన బారికేడ్లు

- 2001లో ఏటూరునాగారం పీఎస్‌ పేల్చివేత
- అప్పటి నుంచి పోలీసుల ఆధీనంలో పోలీస్‌స్టేషన్‌ ఎదుటి రహదారి
- రోడ్డు దిగ్బంధంతో ప్రజలకు తప్పని తిప్పలు
- 23 ఏళ్లుగా వాహనాల రాకపోకలు బంద్‌

ఏటూరునాగారం: ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌ను 2001లో మందుపాతరలతో మావోయిస్టులు పేల్చి వేశారు. దీంతో అప్పటి నుంచి పోలీస్‌ స్టేషన్‌ ఎదురుగా ఉన్న రోడ్డును పోలీసులు బారికేడ్లతో మూసివేశారు. అనంతరం ఐటీడీఏ పీఓ గెస్ట్‌హౌస్‌ చుట్టూ వాహనాలు తిరిగి వెళ్లే విధంగా రోడ్డును మార్పు చేశారు. ఇది 163వ జాతీయ రహదారి కావడంతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. 23 ఏళ్లు గడుస్తున్నా రోడ్డును మాత్రం తెరవకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు తెరుస్తారా అంటూ ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది.

2001లో పోలీస్‌స్టేషన్‌ పేల్చివేత

ఏటూరునాగారం మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డులో ఉన్న పోలీస్‌స్టేషన్‌ను 2001లో అప్పటి పీపుల్స్‌వార్‌ నక్సల్స్‌ మందుపాతరలు, క్లైమోర్‌మైన్స్‌ పెట్టి పేల్చివేశారు. ఈ ఘటనలో పోలీస్‌స్టేషన్‌ భవనం పాక్షికంగా దెబ్బతినడంతో పాటు నలుగురు పోలీసులు, ఒక అయ్యగారు, ఫారెస్ట్‌ చౌకీదార్‌ మృత్యువాత పడ్డారు. పీపుల్స్‌వార్‌ నక్సల్స్‌ ఆ రోడ్డు గుండా వచ్చి మందుపాతరలను పేల్చారని ఆ రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేసి బ్లాక్‌ చేశారు. ఆనాటి నుంచి నేటి వరకు ఆ రోడ్డుకు మోక్షం లేకుండా పోయింది. పాలకులు, ప్రభుత్వాలు, పోలీసులు బాస్‌లు మారుతున్నా ఆ రోడ్డును తెరిపించే నాథుడే కరువయ్యాడు. దీంతో ఆ రోడ్డు మీగుగా వచ్చిపోయే వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతూ ఐటీడీఏ చుట్టూ తిరిగి పోతున్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుత కంప్యూటర్‌ యుగంలో డ్రోన్లతోనే నక్సల్స్‌ ఆచూకీ కనిపెట్టి నివారిస్తున్న పోలీసులకు ఈ రోడ్డును మూసివేయడం వల్ల వారిని నివారించడం సాధ్యమవుతుందా అనే ప్రశ్నలు ప్రజల్లో రేకెత్తుతున్నాయి. ప్రజల సంక్షేమమే ముఖ్యమని చెబుతున్న పోలీసులు కేవలం ఆ రోడ్డును మూసివేయడం వల్ల ప్రయాణికులతో పాటు వాహనదారులను ఇబ్బందులకు గురిచేయడమే తప్ప మరోటి లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీస్‌ ఉన్నతాధికారులు పునరాలోచించి ఈ రోడ్డును తెరిపించాలని ఏజెన్సీ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. అంతేకాకుండా తుపాకులగూడెం వెళ్లే రోడ్డు పోలీస్‌స్టేషన్‌కు దక్షిణ దిశగా ఉండడంతో ఆ రోడ్డు నుంచి మావోయిస్టులు వచ్చారని దానిని కూడా అప్పుడే మూసివేశారు. ఇప్పటి వరకు కూడా ఆ రోడ్డు మార్గం తెరుచుకోకపోవడంతో ఐటీడీఏ నుంచి వీధుల మీదుగా తుపాకులగూడెం గ్రామానికి వాహనాలు వెళ్తున్నాయి.



మలుపు వద్ద ట్రాఫిక్‌ జామ్‌ కావడంతో భారీగా నిలిచిన లారీలు

డబుల్‌ కాంక్రీట్‌ వాల్‌

ఆ రోడ్డు వల్ల ప్రమాదం ఉందని పోలీసులు తెలపడంతో 2014లో నేషనల్‌ హైవే అథారిటీ అధికారులు రూ.40 లక్షలు వెచ్చించి డబుల్‌ కాంక్రీట్‌ వాల్‌ను పోలీస్‌స్టేషన్‌ చుట్టూ, ఎదురుగా నిర్మించి ఇచ్చారు. అయినప్పటికీ ఆ రోడ్డును పోలీసులు తెరవడం లేదు. ఎన్నో ప్రమాదాలు పోలీసుల కళ్లముందు జరుగుతున్నా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన వెంకన్న అనే ద్విచక్రవాహన దారుడు సైతం ఆ బారికేడ్‌ను ఢీకొని మృత్యువాతపడ్డాడు. ఐటీడీఏ పీఓ గెస్ట్‌హౌస్‌కు రోడ్డు దగ్గరగా ఉండడంతోపాటు మలుపు ఉండడం వల్ల తరుచూ ఆ గోడను లారీలు, ఇతర వాహనాలు ఢీ కొడుతున్నాయి. అంతేకాకుండా ఇసుక లారీలు, ఆర్టీసీ బస్సులు, ప్రాజెక్టులకు వచ్చే భారీ క్రేన్లు రోజు చుట్టూ తిరిగి వెళ్లే క్రమంలో ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తి గంటల తరబడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే, ఇటీవల ట్రాఫిక్‌ జామ్‌ కావడంతో ఆర్టీసీ బస్సు గ్రామంలోని సీఎస్‌ఐ రోడ్డు మీదుగా వెళ్లడంతో విద్యుత్‌ తీగలు తెగిపోయి ప్రమాదం చోటుచేసుకున్న పరిస్థితి ఉంది.

లోక్‌ అదాలత్‌లో 342 కేసుల పరిష్కారం



లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి సూర్యచంద్రకళ, న్యాయవాదులు



రాజీ పత్రాన్ని అందిస్తున్న జడ్జి సూర్యచంద్రకళ, ఎస్పీ శబరీశ్‌

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూర్యచంద్రకళ

ములుగు: లోక్‌ అదాలత్‌లో 342 కేసులు పరిష్కారం అయ్యాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్‌ ఎస్‌వీపీ సూర్యచంద్రకళ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌కు ఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కోర్టు ఆవరణలో మూడు బేంచీలను ఏర్పాటు చేయగా రెండు ఎంవీటీపీ కేసు, కాంపౌండబుల్‌ క్రిమినల్‌ కేసు కింద 118 కేసులను రాజీ కుదుర్చి బాధితులకు రూ.6.10లక్షల కాంపన్సేషన్‌ ఇప్పిటించినట్లు వెల్లడించారు. 85 ఎక్సైజ్‌ కేసుల ద్వారా కాంపన్సేషన్‌ కింద రూ.4.25లక్షలు ఇప్పించినట్లు తెలిపారు. వీటితో పాటు రెండు సివిల్‌, రెండు మెయింటనెన్స్‌ కేసులు, 113 డిజాస్టర్‌ మేనేజ్‌మెంట్‌ కేసులు, ఫ్రీ లిటిగేషన్‌, బీఎస్‌ఎన్‌ఎల్‌కు చెందిన 19 కేసుల్లో రూ.1,51,839 రికవరీ చేయించినట్లు వెల్లడించారు. లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే మరో సారి అప్పీల్‌ ఉండదని, ఇదే అంతిమ తీర్పు అవుతుందన్నారు. లోక్‌ అదాలత్‌ విజయవంతానికి కృషి చేసిన న్యాయవాదులు, పోలీసు అధికారులు, బ్యాంకు, కోర్టు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 100 మంది కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ సివిల్‌ జడ్జి కన్నయ్యలాల్‌, ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ కోర్టు జడ్జి రామమోహన్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్‌, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు వినయ్‌కుమార్‌, అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ పావని, కలెక్టరేట్‌ సూపరింటెండెంట్‌ ప్రసాద్‌, న్యాయవాదులు నర్సిరెడ్డి, మేకల మహేందర్‌, బాలుగు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మానేరు విధ్వంసంపై విచారణ కమిటీ వేయాలి

భూపాలపల్లి రూరల్‌: గత రెండు సంవత్సరాల నుంచి మానేరు నదిలో విధ్వంసానికి పాల్పడి వేలాదిమంది రైతుల జీవనోపాధిని దెబ్బతీసిన ఇసుక మాఫియాపై విచారణ కమిటీ వేసి, అక్రమాలకు పాల్పడిన దోషులను శిక్షించాలని మానేరు పరిరక్షణ సమితి డిమాండ్‌ చేసింది. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్జీటీ పిటీషన్‌ దారులు సంధి సురేందర్‌ రెడ్డి, చిటికెసి సతీష్‌ కుమార్‌ మట్లాడారు. డిసిల్టేషన్‌ పేరుతో మానేరులో ఏర్పాటుచేసిన ఇసుక రీచ్‌లు చట్టవిరుద్ధమని జాతీయ హరిత ట్రిబ్యునల్‌ (ఎన్జీటీ) ఇటీవల తీర్పు ఇచ్చిందన్నారు. చెక్‌ డ్యాముల నిర్మాణం జరగకుండానే పూడికతీత పేరుతో మానేరు నదిలో జరిగిన అక్రమ తతంగానికి ముగింపు పలికిందని హర్షం వ్యక్తం చేశారు. పర్యావరణ చట్టాలను ఏమాత్రం ఖాతరు చేయకుండా బాధ్యతారహితంగా విధులు నిర్వహించిన ఇరిగేషన్‌, మైనింగ్‌ శాఖలకు జరిమానా విధించి అవినీతి అధికారులకు ఎన్జీటీ హెచ్చరిక జారీ చేసిందని పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లా పరిధిలో మానేరులో ఇసుక తవ్వకాలు, రవాణా నిలిపి వేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు.

వామ్మో.. జూన్‌



- వ్యవసాయ పెట్టుబడి కాలం
- విద్యాసంవత్సరం ప్రారంభంతో పుస్తకాల కొనుగోళ్లు, ఫీజుల చెల్లింపులు
- పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం

భూపాలపల్లి అర్బన్‌: జూన్‌.. ఈ మాసంలో తొలకరి వాన పలకరింపు సంబురంతోపాటు వ్యవసాయ పెట్టుబడి ఆరాటం.. నూతన విద్యాసంవత్సరం ప్రారంభంతో పిల్లలకు కొత్త పుస్తకాలు కొనుగోలు చేయడం, బడి, కళాశాలల ఫీజులు చెల్లించడం వంటి ఖర్చులతో పేద, మధ్యతరగతి కుటుంబాల బాధ్యులు సతమతమయ్యే కాలం. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజలు జూన్‌ వచ్చిందంటేనే వామ్మో అనే పరిస్థితి.

అన్నదాత పరిస్థితి అగమ్య గోచరమే..

జిల్లాలో దాదాపు 1.50లక్షలకు పైగా రైతులు ఉన్నారు. ఈ వానాకాలం సీజన్‌ల్లో పంటలకు పెట్టుబడి సమయం ఆసన్నమైంది. వ్యవసాయ పంట భూములను చదును చేసి, దుక్కి దున్ని, విత్తనాలు, ఎరువులకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే వ్యవసాయదారులు పనులు ప్రారంభించారు. కనీసం ఎకరానికి రూ.30వేల పెట్టుబడికి అవసరం ఉంటుంది. ఐదెకరాలున్న రైతు దాదాపు రూ.లక్షకు పైగా డబ్బు వెచ్చించాల్సి ఉంటుంది. ప్రభుత్వం రైతు భరోసా కింద పెట్టుబడి సాయం ఇస్తున్నా అది సరైన సమయానికి చేతికందడం లేదు. పైగా బ్యాంకుల రుణాలు కూడా అవసరమైన సమయానికి అందడం లేదు. దీంతో రైతులు ఒకవైపు బ్యాంకుల చుట్టూ తిరుగుతూనే మరోవైపు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో అటు పిల్లల చదువులు ఇటు వ్యవసాయ పెట్టుబడికి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

బడి ఫీజుల భారం..

జిల్లాలో దాదాపు 70కి పైగా ప్రైవేట్‌ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. గ్రామీణ, మండల స్థాయిలో కొంతమేర తక్కువ ఫీజులు వసూలు చేస్తుండగా.. పట్టణ ప్రాంతాల్లో ఫీజులు ఎక్కువ మొత్తంలో ఉన్నాయి. ప్రీ ప్రైమరీ తరగతులకు రూ.20 వేలకు పైగా, ప్రైమరీకి రూ.40వేలు, హైస్కూల్‌కు రూ.50వేల వరకు ఫీజులు ఉన్నాయి. ఏటా 10నుంచి 20శాతం మేర ఫీజులు పెరుగుతుండడంతో తల్లిదండ్రులపై భారం పడుతోంది. దీనికి తోడు పాఠ్యపుస్తకాలు, నోట్‌ బుక్కులు, యూని ఫాం, బ్యాగులు స్టడీ మెటీరియల్‌ ఇతర ఖర్చులతో మరింత భారం తప్పడంలేదు. ప్రైవేటు ఉద్యోగం చేసుకునే తల్లిదండ్రులు, చిన్నాచితకా, చిరు వ్యాపారాలు చేసుకునేవారికి ఈ బడి ఫీజుల భారం మరింత ఎక్కువగా కనిపిస్తోంది.

వ్యవసాయ పెట్టుబడి ఎకరాకు ఇలా...

- పత్తి విత్తనాలకు రూ.1,500
- దుక్కి, సన్నద్ధత కోసం రూ.6నుంచి 8వేలు
- కూలీల ఖర్చు రూ.3వేలు
- ఎరువులు రూ.6వేలు
- పురుగు మందులు రూ.16వేలు
- పత్తి తీయడానికి రూ.4వేలు
- వరి సాగు ఖర్చు రూ.30వేలు
- మొక్కజొన్న సాగు ఖర్చు రూ.30వేలు

ప్రైవేటు చదువులకు ఖర్చులు ఇలా..

- ప్రీ ప్రైమరీ, ప్రాథమిక స్థాయిల్లో అడ్మిషన్‌ ఫీజు రూ.5వేల నుంచి రూ.7వేలు
- స్కూలు, ట్యూషన్‌ ఫీజు రూ.15వేల నుంచి రూ.30వేలు
- పుస్తకాలకు రూ.4వేల నుంచి రూ.8వేలు
- రెండు జతల యూనిఫాం, స్పోర్ట్స్‌ డ్రెస్‌లు రూ.3వేల నుంచి రూ.5వేలు
- బస్సు రవాణా కోసం రూ.8 నుంచి రూ.10వేలు
- హాస్టల్‌ వసతికి రూ.40వేల నుంచి రూ.70వేలు

క్రీడాకారులకు సౌకర్యాలు కల్పిస్తాం

- మంత్రి సీతక్క

ములుగు: ఔత్సాహిక క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్‌ క్యాంపునకు హాజరైన క్రీడాకారులు కోచ్‌ సందీప్‌ గుప్తాతో కలిసి శనివారం జిల్లా కేంద్రంలోని మంత్రి సీతక్కను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవగా క్రీడాకారుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోచ్‌ సందీప్‌గుప్తా మాట్లాడుతూ జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ధనసరి సూర్య సహకారంతో హెచ్‌సీఏ ఏర్పాట్లు చేసిందని వివరించారు. డీడబ్ల్యూసీ తరఫున తమ వంతు సహకారం అందించినట్లు తెలిపారు. ఓపెన్‌ కేటగిరిలో వరంగల్‌పై జిల్లా జట్టు గెలుపొందడంతో ఇద్దరు క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఓపెన్‌ టోర్నీకి సెలక్ట్‌ అయ్యారని వివరించారు. స్థానికంగా గ్రౌండ్‌, ఇతర సౌకర్యాలు ఉంటే భవిష్యత్‌లో క్రికెట్‌లో రాణించే సత్తా క్రీడాకారులకు ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి అక్కడిక్కడే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి బండారుపల్లి టీజీఆర్‌ఎస్‌ పక్కన ఉన్న స్థలాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి కోచ్‌ సందీప్‌గుప్తాను శాలువాతో సన్మానించారు.



కోచ్‌ సందీప్‌గుప్తాను శాలువాతో సన్మానిస్తున్న మంత్రి సీతక్క

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ములుగు రూరల్‌: గృహ నిర్మాణ రంగంలో వినియోగించే రెడ్‌ మిక్స్‌ మెటీరియల్‌లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండల పరిధిలోని జాకారం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెడ్‌ మిక్స్‌ ప్లాంట్‌ను మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గతంలో వరంగల్‌ జిల్లా పరిసర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి జిల్లా వాసులు రెడ్‌ మిక్స్‌ను వినియోగించే వారని తెలిపారు. జిల్లాలో రెడ్‌ మిక్స్‌ ఏర్పాటుతో వినియోగదారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

లాంగ్వేజ్‌ పండిట్స్‌ అప్‌గ్రేడ్‌

- ఉమ్మడి జిల్లాలో 1,098 పోస్టుల అప్‌గ్రేడ్‌
- ఆరు జిల్లాల్లో పీఈటీ 265 పోస్టులు అప్‌గ్రేడ్‌

విద్యారణ్యపురి: ఎట్టకేలకు లాంగ్వేజ్‌ పండిట్స్‌ను (తెలుగు, హిందీ, ఉర్దూ) అప్‌గ్రేడ్‌ చేస్తూ.. ఈనెల 7న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు రాష్ట్రం లాంగ్వేజ్‌ పండిట్స్‌, పీఈటీ పోస్టుల మంజూరులో అప్‌గ్రేడ్‌ అయిన పోస్టుల సంఖ్యను శనివారం తెలంగాణ రాష్ట్ర విద్యాకమిషనర్‌ విడుదల చేస్తూ.. ఉత్తర్వులిచ్చారు. ఈమేరకు ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో లాంగ్వేజ్‌ పండిట్స్‌ పోస్టుల మంజూరు అప్‌గ్రేడ్‌ అయిన పోస్టుల సంఖ్య ఉమ్మడి వరంగల్‌ జిల్లా మొత్తం లాంగ్వేజ్‌ పండిట్‌ పోస్టులు 1,231 ఉండగా.. అందులో 1,098 పోస్టులు అప్‌గ్రేడ్‌ చేశారు.

పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్‌..

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో మొత్తం 321 పీఈటీ పోస్టులు మంజూరు ఉండగా.. అందులో 265 పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్‌ చేశారు.

జిల్లా	సబ్జెక్ట్‌ పండిట్స్‌	మంజూరైన పోస్టులు	అప్‌గ్రేడ్‌
హనుమకొండ	తెలుగు	103	92
	హిందీ	108	96
	ఉర్దూ	4	4
వరంగల్‌	తెలుగు	128	114
	హిందీ	119	106
	ఉర్దూ	2	2
జనగామ	తెలుగు	115	102,
	హిందీ	111	99
	ఉర్దూ	1	1
మహబూబాబాద్‌	తెలుగు	149	133
	హిందీ	126	112
ములుగు	తెలుగు	57	51
	హిందీ	57	51
భూపాలపల్లి	తెలుగు	75	67
	హిందీ	76	68

జిల్లా	మంజూరు	అప్‌గ్రేడ్‌	జిల్లా	మంజూరు	అప్‌గ్రేడ్‌
హనుమకొండ	74	61	మహబూబాబాద్‌	58	48
జనగామ	58	48	ములుగు	22	18
భూపాలపల్లి	37	31	వరంగల్‌	72	59

తాటిచెట్టు పైనుంచి పడి యువకుడి మృతి

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చిరుతపల్లిలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి మృత్యువాత పడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. చిరుతపల్లి గ్రామానికి చెందిన మిచ్చా శివ(25) శుక్రవారం ఇంట్లో ఉన్న తాటి చెట్టు ఎక్కి తాటికమ్మలను తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో కాలు అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌ ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి శివ చెందాడు.



శివ(ఫైల్‌)

ప్రాణం తీసిన వరిగడ్డి..

● మంటలు అంటుకుని యువకుడి మృతి


తిరుపతి (ఫైల్)

హసన్‌పర్తి : వరి గడ్డికి నిప్పుపెడుతుండగా మంటలు అంటుకుని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సిద్ధాపురంలో జరిగింది. హసన్‌పర్తి ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిల్ల రాజేందర్‌కు ఎకరం వ్యవసాయ భూమి ఉంది. అయితే ఇందులో వరిగడ్డి పెరిగిపోవడంతో నిప్పుపెట్టడానికి రాజేందర్ తన కుమారుడు తిరుపతి(30)తో కలిసి శుక్రవారం పొలం వద్దకు వెళ్లాడు. వరిగడ్డికి నిప్పు పెడుతున్న క్రమంలో ఒకేసారి మంటలు చేలరేగి తిరుపతికి అంటుకున్నాయి. దీంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. మెరుగైన వైద్యం కోసం నగరంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేర్చారు. అయితే పరిస్థితి విషమించగా మారడంతో మళ్లీ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ శనివారం తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


రాజిరెడ్డి (ఫైల్)

మొగుళ్లపల్లి: విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యార రాజిరెడ్డి(58) తన వడ్లను మిల్లుకు తీసుకెళ్లడానికి అదే గ్రామానికి చెందిన పండుగ శ్రీధర్‌కు చెందిన టాటా ఏస్ వాహనాన్ని ఇంటి వద్దకు తెప్పించుకున్నాడు. వాహనం రివర్స్ వస్తున్న క్రమంలో విద్యుత్ తీగ అడ్డుతగులుతుందని రాజిరెడ్డి తన చేతితో పట్టుకుని పక్కకు జరిపే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పట్టుకున్న చోట ఆ తీగ పేలి ఉండడంతో విద్యుత్ సరఫరా జరిగి మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

85 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో సుమారు 85 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ శనివారం తెలిపారు. వంగపహాడ్‌లోని ఓ ప్రాంతంలో రేషన్ బియ్యం నిల్వ ఉన్నాయనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో పెద్ద ఎత్తున బియ్యం లభ్యమయ్యాయి. నడికూడ మండలం చర్లపల్లికి చెందిన బండి కుమార్ వంగపహాడ్ కేంద్రంగా పీడీఎస్ బియ్యం దందా చేస్తున్నాడు. వివిధ ప్రాంతాల నుంచి బియ్యం తక్కువ ధరకు సేకరించి వంగపహాడ్‌లోని ఓ ప్రాంతంలో డంప్ చేస్తున్నాడు. దీనిపై టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్థానిక పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్, ఎస్సై రవికుమార్, స్థానిక ఎస్సై సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు శుభవార్త..

● కాజీపేట జంక్షన్‌లో 24 గంటలూ డార్మెటరీ గదులు
● అందుబాటులో చక్రాల కుర్చీలు
● ఫిర్యాదుల కోసం డయల్ 139


కాజీపేట రైల్వే జంక్షన్

కాజీపేట రూరల్: రైల్వే ప్రయాణికులకు శుభవార్త. ఉత్తర, దక్షిణ భారత ప్రాంతాలకు గేట్‌వే కాజీపేట జంక్షన్. ఇక్కడ రైల్వే అధికారులు ప్రయాణికుల కోసం పలు సదుపాయాలు, సౌకర్యాలు కల్పించారు. ఇందులో రిటైరింగ్ రూమ్స్ కూడా ఒకటి. ఈ సౌకర్యం పొందాలంటే ప్రయాణికులు తమ టికెట్‌తో ఆన్‌లైన్‌లో ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజయం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) లోకి వెళ్లి లాగిన్ అయి బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఏసీ డార్మెటరీ, డిలక్స్ రూమ్స్ ఏసీ, జెండ్స్ డార్మెటరీ ఏసీ, విశ్రాంతి గదులు అందుబాటులో ఉంటాయి.

అందుబాటులో చక్రాల కుర్చీలు..

కాజీపేట జంక్షన్‌లో చక్రాల కుర్చీలు ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై ఉన్న ఉప రైల్వే స్టేషన్ మాస్టర్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయి. దివ్యాంగులు, పేషెంట్లు, అనారోగ్యంగా ఉన్నవారు ఈ చక్రాల కుర్చీలను సద్వినియోగం చేసుకోవచ్చు.

రైల్వే కూలీ చార్జీలు ఇలా..

కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికుల సామగ్రి తీసుకెళ్లడానికి రైల్వే అధికారులు వస్తువుల బరువును బట్టి ధరలు నిర్ణయించారు. 40 కేజీల బరువు గల వస్తువులకు రూ.80, చక్రాల కుర్చీపై తీసుకెళ్లేందుకు రూ.90లు, ట్రాలీ లోడ్‌లో వస్తువులు తీసుకెళ్లేందుకు రూ.165 చార్జీ ఉంటుంది.

చెత్త వేయొద్దు

కాజీపేట జంక్షన్‌లో పరిసరాలను శుభ్రంగా ఉంచాలి. లేనిపక్షంలో రైల్వే పోలీసులు జరిమానాలు విధిస్తారు. రైల్వే స్టేషన్‌లో ఎక్కడైనా చెత్త వేస్తే వేసిన ప్రయాణికుడికి రూ.500 జరిమానా విధిస్తారు.


డార్మెటరీ రూమ్‌ల ధరల పట్టిక, వివరాలు



డయల్ 139 సమాచారం

రైల్ మదద్ నంబర్ 139..

ప్రయాణికుల ఫిర్యాదులు పరిష్కరించేందుకుగాను రైల్వేశాఖ అన్నింటికి ఒకే హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. రైల్ మదద్‌గా 139 నంబర్‌ను అందుబాటులో ఉంచింది. రైలు ప్రయాణ సమయంలో ప్రయాణికుల భద్రత, వైద్య సదుపాయం, ప్రమాద సమాచారం, రైళ్లలో ఫిర్యాదులు, స్టేషన్ ఫిర్యాదులు, నిఘా సమాచారం, రవాణా పార్సిల్, సాధారణ విచారణ కోసం డయల్ 139 కాల్ చేసి సమస్య పరిష్కారం పొందొచ్చు.

రిజర్వేషన్ కౌంటర్

కాజీపేట జంక్షన్ రిజర్వేషన్ కౌంటర్ రోజూ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. తత్కాల్ టికెట్ ఏసీ ఉదయం 10 గంటలకు, తత్కాల్ టికెట్ ఉదయం 11 గంటలకు ప్రారంభం. సాధారణ రైల్వే టికెట్ కౌంటర్లు 24 గంటలూ అందుబాటులో ఉంటాయి.

ఈ–సెట్ ప్రవేశ ప్రక్రియ షురూ

● 11వ తేదీ వరకు స్లాట్ బుకింగ్
● ఈనెల 10 నుంచి12వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన
● 14 నుంచి వెబ్ ఆప్షన్స్
● హెల్ప్‌లైన్ సెంటర్ క్యాంపు ఆఫీసర్ భైరి ప్రభాకర్


అడ్మిషన్ల ప్రక్రియ వివరాలు వెల్లడిస్తున్న ప్రభాకర్

వరంగల్ : రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీ, ఇతర ఇంజనీరింగ్ కళాశాలలో నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశం కోసం పాలిటెక్నిక్ డిప్లొమా చదివిన వారికి నిర్వహించిన ఈసెట్–2024లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు శనివారం నుంచి అడ్మిషన్ల ప్రక్రియ షురూ అయిందని వరంగల్ జిల్లా హెల్ప్ లైన్ సెంటర్ క్యాంపు ఆఫీసర్ డాక్టర్ భైరి ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ కౌన్సిలింగ్‌లో భాగంగా వరంగల్ జిల్లా కేంద్రంలోని వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్, హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలన కోసం 11 వ తేదీ వరకు స్లాట్లు బుక్ చేసుకోవాలని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు జరుగుతుందన్నారు. విద్యార్థులు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2 గంటల మధ్య భోజన విరామ సమయం మినహాయించి ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏదైనా సమయంలో స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న సమయానికి 30 నిమిషాల ముందు కౌన్సెలింగ్ కేంద్రం వద్ద రిపోర్ట్ చేయాలన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ అంటే.. ఈ–సెట్ 2024 హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఆధార్ కార్డు, ఎస్ ఎస్‌సీ మెమో, డిప్లొమా ప్రొవిజనల్ సర్టిఫికెట్, డిప్లొమా మెమో, 7వ తరగతి నుంచి డిప్లొమా వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు సెట్ జిరాక్స్ కాపీలు కూడా తీసుకుని కౌన్సెలింగ్ వద్దకు రావాలన్నారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం విద్యార్థులకు తాము నమోదు చేసుకున్న మొబైల్ నంబర్‌కు లాగిన్ ఐడీ వస్తుందన్నారు. తరువాత విద్యార్థులు లాగిన్ ఐడీతో www.tgecet.nic.in వెబ్‌సైట్‌లో తమకు నచ్చిన పాస్‌వర్డ్‌ను నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు పాస్‌వర్డ్ నమోదు చేసుకున్న అనంతరం www.tgecet.nic.in వెబ్ సైట్‌లో లాగిన్ అయి ఈనెల 10వ నుంచి 14వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్ నమోదు చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఇంజనీరింగ్ కళాశాలలో 10 శాతం సీట్లతో పాటు మొదటి విద్యాసంవత్సరంలో మిగిలిన సీట్లకు ఈ–సెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు వెబ్‌ఆప్షన్ ఇచ్చుకునే అవకాశం ఉందన్నారు. వెబ్‌ఆప్షన్ నమోదు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 18వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు www.tgecet.nic.in వెబ్ సైట్‌లో లాగిన్ అయి ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లోనే సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని ప్రభాకర్ తెలిపారు.

డబ్బు, భూమి ఇప్పించి న్యాయం చేయాలి..

● మృతుడి కుటుంబీకులు, బంధువుల డిమాండ్
● మృతదేహంతో సుమారు 15 గంటల ఆందోళన
● పోలీసుల జోక్యంతో విరమణ


మృతదేహంతో ఆందోళన చేస్తున్న సాంబారెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు


సాంబారెడ్డి (ఫైల్)

కమలాపూర్: తమకు రావాల్సిన డబ్బు, భూమి ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహంతో సుమారు 15 గంటల పాటు ఆందోళన చేపట్టారు. ఈ ఘటన శనివారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శ్రీరాములపల్లిలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలం సీతానాగారం గ్రామానికి చెందిన సూదుల సాంబారెడ్డి (58), కమలాపూర్ మండలం శ్రీరాములపల్లికి చెందిన తాటిపాముల శేఖర్ కలిసి సుమారు 20 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. తొమ్మిదేళ్ల పాటు సజావుగా వ్యాపారం చేసిన వీరి మధ్య 11 ఏళ్ల క్రితం ఆర్థిక లావాదేవీల విషయంలో విభేదాలొచ్చాయి. పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు నిర్వహించి లెక్కలు చేసుకోగా శేఖర్.. సాంబారెడ్డికి రూ.65 లక్షల నగదుతో పాటు 2,980 గజాల భూమి (ప్రస్తుత మార్కెట్ ధర సుమారు రూ.7 కోట్లు), మంత్రపురి కాలనీలో ఇల్లు ఇవ్వాలని తేల్చారు. కానీ అప్పటి నుంచి శేఖర్ ఆ డబ్బు, భూమి, ఇల్లు ఇవ్వకుండా పెద్ద మనుషుల తీర్పును ధిక్కరిస్తూ దాట వేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలోనే ఇదే విషయమై ఇటీవల హైదరాబాద్‌లో ఓ పెద్ద మనిషి దగ్గరకు సాంబారెడ్డి వెళ్లగా శేఖర్ వెళ్లలేదు. దీంతో సాంబారెడ్డి మనస్తాపంతో గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. శేఖర్.. పెద్దమనుషుల తీర్పును ధిక్కరించడంతోనే సాంబారెడ్డి మృతి చెందాడని, తమకు డబ్బు, భూమి, ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబ సభ్యులు అదేరోజు అర్ధరాత్రి సాంబారెడ్డి మృతదేహాన్ని శ్రీరాములపల్లికి తీసుకొచ్చి శేఖర్ ఇంటి ముందు వేశారు. శనివారం 3 గంటలకు వరకు ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న కమలాపూర్, హసన్‌పర్తి సీఐలు హరికృష్ణ, సురేశ్ సిబ్బందితో కలిసి శ్రీరాములపల్లికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి శాంతింపజేశారు. పోలీసుల జోక్యంతో సుమారు 15 గంటల అనంతరం మృతుడి కుటుంబీకులు ఆందోళన విరమించారు.

వివాహం కావడం లేదనే మనస్తాపంతో..

● యువకుడి ఆత్మహత్య
● సముద్రాలలో ఘటన


భరత్(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్ : వివాహం కావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని సముద్రాలలో జరిగింది. మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భాస్కుల భరత్(35) చిన్నప్పుడే తండ్రి నర్సయ్య మృతిచెందగా తల్లి నర్సమ్మ కూలీ పని చేస్తూ కుమారుడిని పెంచి పెద్ద చేసింది. డిగ్రీ వరకు చదువుకున్న భరత్ ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా భరత్‌కు పెళ్లి సంబంధాలు చూస్తుండగా కుదరడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన భరత్ శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రోజూ మాదిరిగానే ఉపాధి హామీ పనులకు వెళ్లిన తల్లి యాదమ్మ ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు గడియ వేసి ఉండడంతో కిటికీ నుంచి చూసింది. ఇంటి పైకప్పుకు కుమారుడు వేలాడుతూ కనిపించగా లబోదిబోమంటూ చుట్టు పక్కల వారిని పిలిచింది. వారు వచ్చి తలుపులు తీసి లోపలికి వెళ్ల చూడగా భరత్ మృతిచెంది ఉన్నాడు. దీంతో కుమారుడు మృతదేహంపై పడి తల్లి గుండెలవిసేలా రోదించింది.

బోధన, ప్రయోగాల్లో విస్తృత మార్పులు

● కేయూ కెమిస్ట్రీ విభాగం ఆచార్యులు వాసుదేవరెడ్డి
● కొనసాగుతున్న పాలిటెక్నిక్ అధ్యాపకుల శిక్షణ


శిక్షణలో మాట్లాడుతున్న వల్లాల పృథ్వీరాజ్

కేయూ క్యాంపస్ : ప్రస్తుతం బోధన, ప్రయోగ పద్ధతుల్లో విస్తృత మార్పులు ఏర్పడుతున్నాయి.. అందుకు అనుగుణంగా అధ్యాపకుల విద్యాబోధనలో మార్పులు రావాలని కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం ఆచార్యులు కె.వాసుదేవరెడ్డి అన్నారు. క్యాంపస్‌లోని కెమిస్ట్రీ విభాగం సెమినార్ హాల్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకుల మూడు వారాల ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌లో భాగంగా శనివారం నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. రసాయశాస్త్రంపై ఆసక్తి పరిశోధనకు నాంది అని అన్నారు.

మానవ సంబంధాలతోనే సమాజ మనుగడ: కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పృథ్వీరాజ్

మానవ సంబంధాలతోనే సమాజ మనుగడ సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ తెలిపారు.ఈ మేరకు శనివారం కెమిస్ట్రీ విభాగం అధిపతి అధ్యక్షతన జరిగిన ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకులకు 21 శతాబ్దంలో మానవ సంబంధాలు అనే అంశంపై ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మానవ సంబంధాలు పెంపొందించడంలో అధ్యాపకుల పాత్ర కీలకమన్నారు. సమాజ మానవ మనుగడ, అభివృద్ధిలో వ్యక్తిత్వ వికాసం మానవ సంబంధాలు ఎలా ఉపయోగపడుతాయనేది తెలియజేశారు.

కారులో వచ్చి.. సినీఫక్కీలో చోరీ

● రోడ్డు పక్కన పండ్లు అమ్ముతున్న మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ
● ఛాగల్లు శివారులో ఘటన


బాధితురాలు ప్రమీల

స్టేషన్‌ఘన్‌పూర్: జాతీయ రహదారి పక్కన పండ్లు అమ్ముకుంటున్న ఓ మహిళ మెడలో నుంచి కారులో వచ్చిన ముగ్గురు వ్యక్తులు సినీఫక్కీలో పుస్తెలతాడు లాక్కెళ్లారు. ఈ ఘటన శనివారం సాయంత్రం మండలంలోని ఛాగల్లు శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఛాగల్లుకు చెందిన అన్నెపు ప్రమీల గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కన పండ్లు అమ్ముకుంటోంది. ఈ క్రమంలో సాయంత్రం కారులో ముగ్గురు వ్యక్తులు వచ్చి ఆమె వద్ద ఆగారు. అందులో ఒకరు పండ్లు ధర ఎంత అని అడగగా.. మరొకరు దాహం వేస్తుంది నీళ్లు ఉన్నాయా అని మాటల్లోకి దింపాడు. అనంతరం మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును లాగే ప్రయత్నం చేయగా ఆమె చేతితో పట్టుకుని ప్రతిఘటించింది. ఆ సమయంలో అటుగా మరో కారు రావడంతో దుండగులు పుస్తెల తాడు లాగడంతో తెగింది. సగం గొలుసు బాధితురాలి చేతిలో ఉండగా మిగతా సగం గొలుసు(తులంన్నర) తీసుకుని దొంగలు పరారయ్యారు. దీంతో ప్రమీల లబోదిబోమంటూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ ముస్క రాజు, ఎస్సైలు నాగరాజు, వినయ్ దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై పట్టపగలే సినీ ఫక్కీలో చోరీ జరగడం డివిజన్ కేంద్రంలో చర్చనీయాంశమైంది.

అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

● రూ.50 లక్షల విలువైన 192 కిలోల సరుకు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిశోర్ ఝా


స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న సీపీ

వరంగల్ క్రైం: ముగ్గురు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్, దామెర పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. నిందితుల నుంచి రూ.50 లక్షల విలువైన 192 కిలోల గంజాయితో పాటు కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులు భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరికి చెందిన గజ్జి సహదేవ్, మహారాష్ట్రలోని కలాట్‌వాడికి చెందిన సోమనదాత్ రాందాస్ కాలాటిని అరెస్ట్ చేయగా మరో ముగ్గురు ఒడిశాకు చెందిన పాండు, లక్ష్మీ తాబే, మహారాష్ట్రకు చెందిన వికాస్ తాటి పరారీలో ఉన్నట్లు సీపీ పేర్కొన్నారు. సీపీ కథనం ప్రకారం.. గజ్జి సహదేవ్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న క్రమంలో మిగతా నిందితులతో పరిచయం ఏర్పడింది. అనంతరం సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో వీరందరూ కొద్ది రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు మండలం తునుగొండ గ్రామ పరిసరాల నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించి ఎక్కువ ధరకు విక్రయించేవారు. ఈ క్రమంలో గజ్జి సహదేవ్, ఇతరులతో కలిసి తునుగొండలో 192 కిలోల గంజాయిని కొనుగోలు చేసి రెండుకిలోల చొప్పున 96 ప్యాకెట్లలో ప్యాక్ చేసి కారులో భద్రపరిచాడు. అనంతరం చింతూరు నుంచి ఏటూరునాగారం, ములుగు మీదుగా మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు శనివారం ఉదయం టాస్క్‌ఫోర్స్, దామెర పోలీసులు శ్రీహర్ష స్కూల్ ప్రాంతంలో నిందితులను పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గజ్జి సహదేవ్‌పై గతంలో హనుమకొండ, పరకాల పీఎస్‌ల పరిధిలో కేసులు ఉన్నట్లు సీపీ తెలిపారు. ఈ ముఠా సభ్యులను అరెస్ట్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ చూపిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు సార్ల రాజు, ఎస్.రవికుమార్, ఎస్సైలు నిస్సార్‌పాషా, శరత్‌కుమార్, అశోక్, ఏఏఓ సల్మాన్ పాషా, టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, కృష్ణ, కానిస్టేబుళ్లు సురేశ్, శ్రీనివాస్, అంజయ్య, విజయ్‌కుమార్, శ్రీనివాస్, అఫ్జల్‌ఖాన్, సతీష్, నాగరాజును వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా అభినందించారు.

అప్పు తీర్చడం లేదని చంపేశారు

● ముగ్గురి నిందితుల అరెస్ట్
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ సంపత్‌రావు


హత్య వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

భూపాలపల్లి అర్బన్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో గురువారం రాత్రి జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ సంపత్‌రావు వెల్లడించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్యకు గల కారణాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రాంనగర్ కాలనీకి చెందిన పంగ రమేశ్ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గొడిశాలకు చెందిన దొంత మల్లేశ్ నుంచి రమేశ్ రెండేళ్ల క్రితం రూ.2లక్షలు అప్పు తీసుకున్నాడు. కాగా, పంగ రమేశ్ తన అత్తారిల్లు సుల్తానాబాద్ మండలం గట్టెపల్లిలో ఉండగా దొంత మల్లేశ్ కుమారుడు నాగరాజు అక్కడికి వెళ్లి రూ.2లక్షలు ఇవ్వాలని అడిగినట్లు తెలిపారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగిందన్నారు. వెంటనే రమేశ్ అక్కడి నుంచి భూపాలపల్లికి రాగా మల్లేశ్ అతని కుమారుడు నాగరాజు పథకం ప్రకారం కారులో భూపాలపల్లికి వచ్చారు. ఈ క్రమంలో భూపాలపల్లికి చెందిన మరో బంధువు దండు జితేందర్‌ను తీసుకొని గురువారం అర్ధరాత్రి రమేశ్ ఇంటికి వెళ్లి తలుపులు బలవంతంగా తొలగించి లోపలికి వెళ్లి డబ్బులు ఇవ్వమంటే ఇవ్వవా అంటూ ముగ్గురు కలిసి పిడిగుద్దులు కురిపించారు. అరవకుండా నోరు మూసి ఛాతీ, కడుపులో తొక్కుతూ హత్య చేశారని వివరించారు. చనిపోయాడని నిర్ధారించుకొని ఎటువంటి ఆధారాలు ఉండకూడదని రక్తపు మరకలు లేకుండా గదులన్నీ శుభ్రంగా కడిగి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించామని వివరించారు. శనివారం ఉదయం కేటీకే 5వ గని సమీపంలో అనుమానాస్పదంగా కనిపించగా సమాచారం తెలుసుకున్న ఇన్‌చార్జ్ సీఐ మల్లేశ్, ఎస్సై ప్రసాద్, సిబ్బందితో వెళ్లి వారిని పట్టుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు.

వరంగల్ కలెక్టర్, డీఆర్‌డీఓకు ప్రశంసలు


మాట్లాడుతున్న కౌసల్యాదేవి

వరంగల్: నిర్దేశించిన గడువులోగా ప్రభుత్వ విద్యాసంస్థలకు సమాఖ్య మహిళలతో స్కూల్ యూనిఫాం కుట్టించి అందజేసినందుకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, డీఆర్‌డీఓను అభినందిస్తూ వాట్సాప్‌లో పోస్ట్ చేసినట్లు డీఆర్‌డీఓ కౌసల్య దేవి శనివారం తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి ప్రయోగాత్మకంగా(సెర్ప్)గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘాల మహిళలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు కుట్టే బాధ్యతలు అప్పగించిందన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం కలెక్టర్ ప్రావీణ్య సూచనల మేరకు గత నెల 15వ తేదీన విద్యాశాఖ అధికారుల నుంచి యూనిఫాం క్లాత్ తీసుకుని జూన్ 7 తేదీ వరకే జిల్లా వ్యాప్తంగా ఉన్న 38,020 మంది విద్యార్థుల యూనిఫామ్స్‌ను కేవలం 21 రోజుల్లోనే కుట్టించి ఆయా మండలాల విద్యాశాఖ అధికారులకు అప్పగించామన్నారు. నిర్దేశించిన గడువులోపే సమర్థవంతంగా పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాం అందజేయడానికి అన్ని విధాలా సహకారాలు అందించిన కలెక్టర్ ప్రావీణ్య, మండల, గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు అన్ని విభాగాల డీపీఎం, ఏపీఎం, సీసీలకు కౌసల్యాదేవి కృతజ్ఞతలు తెలిపారు.

ఆడుకుంటూ అనంతలోకాలకు..

● బావిలో పడి చిన్నారి మృతి
● లాలాయిగూడెంలో ఘటన


వేదశ్రీ (ఫైల్)

ములుగు రూరల్ : ఓ చిన్నారి ఆడుకోవడానికి వెళ్లి అనంతలోకాలకు చేరింది. స్నేహితులతో కలిసి బావి పక్కన ఆడుకుంటున్న క్రమంలో అందులో పడి మృతి చెందింది. ఈ విషాదకర ఘటన ములుగు మండలం లాలాయిగూడెంలో జరిగింది. ఎస్సై వెంకటేశ్వర్ కథనం ప్రకారం.. గోవిందరావుపేట మండలం పాపాయ్యపల్లికి చెందిన బానోత్ అశోక్‌కుమార్ ములుగు మండలం లాలాయిగూడేనికి చెందిన కృష్ణవేణిని ఏడు సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు ఒక కూతురు వేదశ్రీ(5)ఉంది. బతుకుదెరువు నిమిత్తం సంవత్సరం క్రితం లాలాయిగూడేనికే వలస వచ్చారు. ఈ క్రమంలో అశోక్‌కుమార్ ఇంటి పక్కన ఉంటున్న జాడి శ్రీనివాస్ శనివారం తన వ్యవసాయ భూమిలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అతడి కూతురు శాంతిక తన తమ్ముడితో కలిసి వేదశ్రీని వెంటబెట్టుకుని వ్యవసాయ భూమి వద్దకు వెళ్లింది. ఈ ముగ్గురు బావి వద్ద ఆడుకుంటున్న క్రమంలో వేదశ్రీ, శాంతిక బావిలో పడ్డారు. ఈ విషయం గమనించిన శాంతిక తమ్ముడు పొలంలో ఉన్న తండ్రి శ్రీనివాస్‌కు తెలిపాడు. దీంతో ఆయన వెంటనే బావిలో చిన్నారులను వెతకగా శాంతిక మాత్రమే దొరికింది. వేదశ్రీ కనిపించకపోవడతో కొద్ది సమయం గాలింపు చేపట్టగా దొరికింది. దీంతో ఇద్దరు చిన్నారులను ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు వేదశ్రీ అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. శాంతికకు చికిత్స అందిస్తున్నారు. వేదశ్రీ మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. చిన్నారి మృతదేహం మీదపడి కన్నీరుమున్నీరుగా విలపించారు.